# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  27-01-2025                                   సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశ నిర్మాణం పట్ల ఎన్‌సిసి యువతకు నిరంతరం స్ఫూర్తినిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు.
- ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న కుంభ మేళాకు నిన్నటి వరకు 13 కోట్ల 21 లక్షల మంది భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు.
- భారతదేశం త్వరలో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు రాజధానిగా మారుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- ఉమ్మడి పౌరస్మృతి యూనిఫాం సివిల్ కోడ్ (UCC)ని అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించింది.
- భారత క్రికెటర్లు జస్ప్రీత్ బుమ్రా, స్మృతి మంధాన 2024లో అత్యుత్తమ ప్రదర్శన చేసినందుకు గానూ ఐసీసీ అవార్డులకు ఎంపికయ్యారు.

==========================

దేశ నిర్మాణం పట్ల ఎన్‌సిసి యువతకు నిరంతరం స్ఫూర్తినిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో ఈరోజు జరిగిన వార్షిక నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సిసి) ర్యాలీకి ప్రధానమంత్రి హాజరయ్యారు. 'యువ శక్తి, వికసిత్ భారత్' ఇతివృత్తంగా ఈ సంవత్సరం ఎన్‌సీసీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో యువత చేస్తున్న కృషిని కొనియాడారు. గత 10 సంవత్సరాల్లో యువత లక్షా 50 వేలకు పైగా అంకురా సంస్థలను ప్రారంభించి ప్రపంచంలోని అగ్రశ్రేణి కంపెనీలకు నాయకత్వం వహిస్తుందని చెప్పారు. 2014లో 14 లక్షల మంది ఉన్న ఎన్‌సిసి క్యాడెట్ల సంఖ్య గత పదేళ్లలో 20 లక్షలకు చేరుకుందన్నారు. విపత్తు నిర్వహణ, క్రీడా కార్యకలాపాల్లో ఎన్‌సిసి క్యాడెట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని నరేంద్రమోడీ పేర్కొంటూ....

(వాయిస్ 37 సెకన్లు)

=========================

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న కుంభ మేళాకు నిన్నటి వరకు 13 కోట్ల 21 లక్షల మంది భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు. ఈరోజు నుండి ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళా ప్రాంతాన్ని మొత్తం వాహనాలు సంచరించ కూడని ప్రాంతంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 29న మౌని అమావాస్య రోజున భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించింది. ఇదిలా ఉండగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయాగ్ రాజ్ లోని త్రివేణి సంగమం పవిత్ర జలాల్లో పుణ్య స్నానం ఆచరించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, పలువురు సాధువులు హోంమంత్రితో కలిసి పుణ్యస్నానాలు చేశారు.

=========================

భారతదేశం త్వరలో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు రాజధానిగా మారుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈరోజు ఆయన కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ తో కలిసి న్యూఢిల్లీలో వేవ్స్ బజార్, వాహ్ ఉస్తాద్ ఛాలెంజ్, వేవ్స్ అవార్డులను ప్రారంభించారు. అనంతరం అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... భారత్ తన వారసత్వం, సంస్కృతి, కథ చెప్పే కళకి సంబందించి ప్రపంచ వేదికలో చాలా ప్రాముఖ్యతను పొందుతోందని అన్నారు.

(వాయిస్ 31 సెకన్లు)

అదే విదంగా కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ మాట్లాడుతూ... భారతదేశం కథకుల భూమి అని ఈరోజు ప్రారంభించబడిన ఈ కార్యక్రమాలు భారతదేశం మృదువైన శక్తిని ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలకు తీసుకువెళ్తాయని అన్నారు. ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, రక్షణ రంగాలలో అభివృద్ధి చెందుతోందని భారతీయ సంస్కృతి దేశానికి నిజమైన శక్తి అని ఆయన పేర్కొన్నారు.

=========================

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈరోజు ప్రారంభమయిన 11వ జాయింట్ కమిషన్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒమన్ మంత్రి కైస్ బిన్ మొహమ్మద్ బిన్ మూసా అల్-యూసెఫ్‌తో సమావేశమయ్యారు. వాణిజ్యం, పెట్టుబడులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితిపై మంత్రులిద్దరూ చర్చించారు.

=========================

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మూడు రోజుల పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరచడానికి UAE మంత్రులతో సమావేశం కానున్నారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు అవకాశం కల్పిస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

విరామం

=========================

ఉమ్మడి పౌరస్మృతి యూనిఫాం సివిల్ కోడ్ (UCC)ని అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించింది. పౌరులందరికీ సమాన హక్కులను నిర్ధారించడం ద్వారా వ్యక్తిగత పౌర చట్టాలను ప్రామాణీకరించడాన్నిఆ రాష్ట్ర ప్రభుత్వం  లక్ష్యంగా పెట్టుకుంది. షెడ్యూల్డ్ తెగలు మినహా పౌరులందరికీ వివాహం, వారసత్వం, విడాకులపై సమానమైన నిబంధనలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాగా ఉత్తరాఖండ్‌లో 2022 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా యుసిసిని అమలు చేస్తామని భారతీయ జనతా పార్టీ ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్‌ధామి మాట్లాడుతూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========================

భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా 2024లో తన అసాధారణ ప్రదర్శనకు ICC పురుషుల టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యాడు. 2024లో బుమ్రా ఆడిన 13 టెస్ట్ మ్యాచ్‌లలో 357 ఓవర్లు బౌలింగ్ చేసి 14.92 సగటుతో 71 వికెట్లు తీశాడు. మరోవైపు మహిళల క్రికెట్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన ఐసీసీ మహిళా వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైంది. 2024లో మొత్తం 13 మ్యాచ్ లు ఆడిన స్మృతి 747 పరుగులు చేసింది.

==========================

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (BSF) పంజాబ్ సరిహద్దు వద్ద ఐదుగురు పాకిస్తానీ చొరబాటుదారులను నిలువరించింది. 2024 జనవరి నుండి ఈ సంవత్సరం జనవరి 26వ తేదీ వరకు పాకిస్తాన్ నుండి భారత భూభాగంలోకి చొరబడిన 30 మంది పాకిస్తాన్ జాతీయులను అదుపులోకి తీసుకుంది. అలాగే మాదక ద్రవ్యాలను సరఫరా చేసే 101 మంది భారతీయులను  పట్టుకున్నామని బిఎస్ఎఫ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సతీష్ ఖండారే వెల్లడించారు. సరిహద్దు దళం 301 కిలోల హెరాయిన్‌ను కూడా స్వాధీనం చేసుకుందని తెలిపారు.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 76 వేల 190 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరికి 824 పాయింట్ల నష్టంతో 75 వేల 366 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 263 పాయింట్లు కోల్పోయి 22 వేల 829 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 11 పైసలు బలహీనపడి 86.33 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 78.74 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 769 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

==========================

ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లోని మహారాణా ప్రతాప్ స్టేడియంలో రేపు 38వ జాతీయ క్రీడలు ప్రారంభం కానున్నాయి. ఈ జాతీయ క్రీడలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు లాంఛనంగా ప్రారంభించనున్నారు.

==========================
==========================